48వ డివిజన్‌లో టీడీపీకి షాక్

- 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన బాలినేని ప్రణీత్‌రెడ్డి


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: తెలుగుదేశం పార్టీకి స్థానిక 48వ డివిజన్‌లో షాక్ తగిలింది. తెలుగుదేశం పార్టీ నుంచి 30 కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు ముందుకు వచ్చాయి. ప్రచార కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్‌కు విచ్చేసిన వైఎస్సార్ సీపీ యువ నేత బాలినేని ప్రణీత్‌రెడ్డిని కలిసి వారు పార్టీలో చేరాలనుకుంటున్నట్లు తెలిపారు. మూడు పార్టీలు ఏకమై ఎన్నికల్లో పోటీచేసినా జగన్‌కు ఏమీ కాదని, చెడు నాలుగు రకాలుగా ఏకమైనా, మంచి గెలుస్తుందని వారు చెప్పారు. 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని మాల్యాద్రి, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, డివిజన్ వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు శ్రీదేవి, విజయ, మల్లీశ్వరి, అంజమ్మ, తిరుపతమ్మ తదితరుల సమక్షంలో 30 కుటుంబాల వారికి బాలినేని ప్రణీత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని ఎందుకు అంటారో' గడపగడపలో తిరుగుతున్నప్పుడు అర్థం అవుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మహిళలు తమ కుటుంబ సభ్యునిలా భావిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఒంగోలు నుంచి 78 శాతం మంది మహిళలు వైఎస్సార్ సీపీ వైపే ఉంటారన్నారు. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీ ఖాయమన్నారు. ప్రజలకు వారి ప్రయోజనాలు ముఖ్యమని, కేవలం మూడు పార్టీలు వాటి ప్రయోజనాలకోసం ఒకటైతే వారిని ఆశీర్వదించే అవకాశం ఉండదన్నారు. 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని మాల్యాద్రి మాట్లాడుతూ స్వచ్ఛందంగా వారంతట వారు వచ్చి పార్టీలోకి చేరడం నిజంగా అభినందనీయమన్నారు. పార్టీలోకి ఎందుకు చేరాలనుకుంటున్నారో కూడా వారు స్పష్టంగా చెబుతుండడం మహిళల్లో లభించిన చైతన్యానికి నిదర్శనం అని చెప్పారు. జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని, అదే విధంగా వాసన్న గెలిస్తేనే పేదలకు ఏదైనా ఆపద వస్తే ఆదుకోవడం జరుగుతుందంటూ వారు పేర్కొంటున్న తీరు చూస్తేంటే 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 30 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుస్తుందన్నారు.

సీఏఏతో పెను ప్రమాదం


సీఏఏ వ్యతిరేక సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఎల్ నారాయణ

ఒంగోలు టౌన్: సీఏఏ కూడా పెద్ద నోట్ల రద్దు వంటిదే అని, దేశంలోని ముస్లింలతో పాటు హిందూ, క్రిస్టియన్ సోదరులంతా తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకునేందుకు క్యూ కట్టాల్సిన పరిస్థితి వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ముస్లింలను ఇబ్బంది పెట్టాలన్న కుట్ర కూడా ఇందులో దాగుందని చెప్పారు. దేశ ప్రజల మధ్య విభేదాలను రాజేస్తూ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మోదీ సర్కార్ కుట్రలు చేస్తుందని, ప్రజలంతా ఈ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇస్లాంపేటలోని కమ్యూనిటీ హాలులో మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ నాయకులు సయ్యద్ సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ ప్రసంగిస్తూ తాత ముత్తాతల నుంచి జనన ధ్రువీకరణ పత్రాలను చూపాల్సి వస్తుందని, ఈ విషయంలో మిగతా మతాలకు మినహాయింపులు ఇచ్చి ముస్లింను మాత్రం తప్పనిసరి చేయడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ప్రసంగిస్తూ.. సీఏఏ చట్టాన్ని అమలు చేసి తీరుతామని అమిత్‌షా చెబుతున్నాడని, దేశ ప్రజలంతా ఏకమై చట్టాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, కేంద్రంలో చక్రం తిప్పామని పదేపదే చెప్పుకునే నాయకుడు మోదీ ముందు మోకరిల్లడం సిగ్గుచేటని న్యాయవాది కరిముల్లా ఖాన్ అన్నారు. షేక్ మహబూబ్, పీవీఆర్ చౌదరి, ఎంఏ సాలార్, యం. రమేష్, కవి పీకే ఖాన్, రఫీ, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు వేసవి జాగ్రత్తలు


కరపత్రాలను అందిస్తున్న జేడీ డాక్టర్ బేబీరాణి

చీమకుర్తి: వేసవి కాలంలో పశుపోషకులు తీసుకోవాలసిన జాగ్రత్తలపై వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.బేబీరాణి అవగాహన కల్పించారు. మంగళవారం పేర్నమిట్టలో పశుపోషకులతో మాట్లాడారు. పశువులకు అందించాల్సిన మేత, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వాటికి సంబంధించిన కరపత్రాలను అందించారు.

ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు


హెల్ప్‌లైన్ సెంటర్

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఫిర్యాదులు కోసం కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగళవారం తెలిపారు. చీమకుర్తి మున్సిపాలిటీ నూతన కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు ఏవైనా ఫిర్యాదులు ఉంటే వాటిని కమాండ్ కంట్రోల్ రూంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు చెందిన ల్యాండ్ ఫోన్ నంబర్ 08592-273100, మొబైల్ నంబర్ 63056 21139కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు


స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవీ, భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో మంగళవారం ఆంజనేయ స్వామి వారికి అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి.కృష్ణారెడ్డి, కార్యదర్శి పి. చెంచయ్య, కార్యవర్గ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిరుధాన్యాలతో వ్యాధుల నివారణ


దీర్ఘకాలిక వ్యాధుల గురించి వివరిస్తున్న వైద్య విద్యార్థులు

ఒంగోలు టౌన్: రక్తపోటుతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు చిరుధాన్యాలు తినడం వలన ఎంతో మేలు చేకూరుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు చెప్పారు. బియ్యం, మైదా వంటి పదార్థాలు తినకుండా రాగులు, సజ్జలు, జొన్నలు, వరిగెలు, కొర్రలు, ఆరికలు వంటివి తినడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల, యన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని మంగమూరు రోడ్డు, గాంధీ బజారులోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించిన వైద్య విద్యార్థులు బీపీ, షుగర్, క్యాన్సర్, ఫ్లోరోసిస్ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తున్నరా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తిరుమల రావు మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, నూనెతో చేసిన సమోసాలు, బజ్జీలు, బోండాలు, ప్రాసెస్డ్ ఆహారాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. జామకాయ, నారింజ, దానిమ్మ, నేరేడు వంటి పండ్లను ఎక్కువగా తినాలని చెప్పారు. షుగర్ వ్యాధిగ్రస్తులు పీచుపదార్థాలు, చిరుధాన్యాలు తినడం అలవాటు చేసుకుంటే షుగర్ అదుపులో ఉంటుందన్నారు. ప్రతిరోజూ వ్యాయమం , మెడిటేషన్ వంటివి చేయడం మంచిదన్నారు. మెడికల్ ఆఫీసర్ హిమబిందు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు విష్ణుప్రియ , హర్షిత, కిరణ్ కమార్, అనిల్ కుమార్, హౌస్ సర్జన్లు అభిజిత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌లో ముగిసిన వర్క్ షాప్


వర్క్ షాప్‌లో శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్ ఓబులేసు

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో గత అయిదు రోజులుగా పవర్ బీఐ అనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. నరేష్ టెక్నాలజీ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ టీం సభ్యులు ప్రొఫెసర్ బి.ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరై పవర్ బీఐ డేటా ఫ్లో, పవర్ బీఐ డేటాసెట్, డేటా మార్ట్, డేటా హబ్ వంటి టూల్స్‌లో శిక్షణ ఇచ్చారు. దీని ఆధారంగా అనేక ప్రముఖ సంస్థల్లో సమాచార విశ్లేషణ వేగవంతంగా చేయవచ్చని, దీని వల్ల కార్యక్రమాల పర్యవేక్షణ సులభతరం అవుతుందన్నారు. పవర్ బీఐ డెస్క్‌టాప్ , పవర్ బీఐ సర్వీసెస్‌గా పిలిచే క్లౌడ్ ఆధారిత బిజినెస్ ఇంటిలిజెన్స్ సేవలను అందిస్తుందని తెలిపారు. కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ వర్క్‌షాప్‌ను సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌ల వల్ల విద్యార్థులు అనేక ముఖ్య విషయాలు తెలుసుకుంటారన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం , సీఎస్ఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.ఐజాక్‌పాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజశ్యామలాదేవి శాంతి హోమం


హోమానికి హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి దంపతులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ సమీపం సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజశ్యామలాదేవి శాంతి హోమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని దంపతులు పాల్గొన్నారు. వారిని కార్యక్రమాల నిర్వాహకులు శేషభట్టర్ వేదపండితులతో పూర్ణ కలశంతో ఆహ్వానించారు. హోమం అనంతరం యోగనంద లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణంలో పాల్గొన్నారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, మార్తల రమణారెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి (చంటి), ఎస్.వెంకటరెడ్డి, కటకం రామయ్య, శివరావు, టి.పెద్దన్న, ఆరె రంగయ్య, ఎస్ఎస్‌పీ అగ్రహారం సొసైటీ ప్రెసిడెంట్ ఆరె శ్రీనివాసరావు, కె.గోపి, వుల్లారెడ్డి, బి.ఆదినారాయణ, పి.నరసింహారెడ్డి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, వై.రోశయ్య, మోషే, టి.వీరయ్య, ఎస్.రమణారెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, బయ్యవరం సర్పంచ్ నాగేశ్వరరావు, మేరువ పిచ్చిరెడ్డి, వెంకటనారాయణ, ఎం.యోగిరెడ్డి, రమణారెడ్డి, ఇందూరి వెంకట నర్సిరెడ్డి, బెల్లం సురేష్, రమణారెడ్డి, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన జిల్లా అబ్జర్వర్

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న ఏ, బీ సెంటర్‌లను జిల్లా అబ్జర్వర్ ప్రసన్న కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈక్రమంలో ఆయన సెంటర్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సౌకర్యాలు ఉన్నాయా లేవా అంటూ చీఫ్‌లను, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను ప్రశ్నించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి ఆరోగ్య సమస్యలు లేకుండా చూడటానికి వైద్యశాఖ తరఫున కౌంటర్ ఏర్పాటు చేయడం గమనించి అభినందించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్

మద్దిపాడులోని రెండు సెంటర్‌లను తెల్లబాడు జిల్లాపరిషత్ సెంటర్‌ను ఫ్లెయింగ్ స్క్వాడ్ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణలు పరిశీలించారు. ఈక్రమంలో వారు సెంటర్‌లో అరగంటకు పైగా ప్రతి రూములో పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత


డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్న డీఎస్ఓ ఉదయ భాస్కర్

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో నగరంలో పలు వ్యాపార కేంద్రాల్లో డొమాస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినయోగంపై జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ. ఉదయ్‌భాస్కర్ సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. శివాలయం సెంటర్‌లోని ఫ్రూట్ స్టాల్, హోటల్ తనిఖీ చేయగా 8 డొమాస్టిక్ గ్యాస్ సిలిండర్‌లు గుర్తించి సీజ్ చేశారు. వారిపై 6ఏ కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ వ్యాపార కేంద్రాల్లో కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లు మాత్రమే వినియోగించాలని సబ్సిడీపై వచ్చే డొమాస్టిక్ సిలిండర్‌లు వనియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డీఎస్ఓతో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు ఇతర అధికారులున్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


దొడ్డవరంలో రోగులను పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరంలో జరిగిన ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమానికి విశేషమైన స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమాన్ని మంగళవారం ప్రజలు వినియోగించుకుంటున్నారు. స్పెషలిస్టు డాక్టర్‌లు హాజరు అవుతుండటంతో ప్రజలు ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారు. వచ్చిన రోగులకు ఆరోగ్యశాఖ సిబ్బంది పరీక్షలు నిర్వహించి వారిని డాక్టర్‌ల వద్దకు పంపుతున్నారు. ఈక్రమంలో అవసరమైన రోగులకు శస్త్ర చికిత్సలకు కార్పొరేట్ ఆసుపత్రులకు డాక్టర్‌లు సిఫారసు చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ కార్డుల ద్వారా వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం లభించడంతో పాటు ఆరోగ్య ఆసరా కింద రోగి కోలుకునే వరకూ ఆర్థికంగా ప్రభుత్వం నుంచి సాయం అందడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆప్తాల్మిక్ ఆఫీసర్ పరీక్షలు నిర్వహించి వారికి కళ్ల జోడ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్లు ఆనందమోహన్, శ్రావణ్, జగదీష్ శిరీష, ఆసుపత్రి వైద్యశాఖ సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ఒంగోలు రూరల్: రూరల్ లోని కరవది సెంటర్‌లో గుండాయపాలెం, ఉలిచి, కరవదిలో మంగళవారం మొత్తం 110 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. త్రోవగుంట పరీక్ష కేంద్రంలో త్రోవగుంట హైస్కూలు, ముక్తినూతలపాడు హైస్కూలు కలిపి మొత్తం 190 మంది పరీక్షలకు హాజరయ్యారు. సమీపంలోని జెరాక్స్ సెంటర్లు, నెట్ పాయింట్‌లు మూసివేశారు.

ఎలుకల మందు తిని యువతి ఆత్మహత్య

మద్దిపాడు: ఎలుకల మందు తిని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మద్దిపాడులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మద్దిపాడు బీసీ కాలనీకి చెందిన అన్నపురెడ్డి వెంకట లక్ష్మి(24) గత ఏడాదిగా మానసికంగా ఆందోళన చెందుతుంది. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున మానసిక ఆందోళనకు గురై ఇంట్లో ఉన్న ఎలుకుల మందు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమె భర్త, కుటుంబసభ్యులు ఆమెను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 19వ తేదీ ఉదయం మృతి చెందింది. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే


ప్రజలకు అభివాదం చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, అభ్యర్థి శివప్రసాదరెడ్డి

- డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

తూర్పుగంగవరం (ముండ్లమూరు): ముస్లిం, మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి ఆదుకున్న ఘనత ఈ దేశంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని దర్శి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం, తూర్పుగంగవరం గ్రామాల్లో మంగళవారం రాత్రి మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూచేపల్లి కుటుంబ సభ్యులకు మహిళలు, ప్రజలు క్రేన్ సాయంతో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ప్రచార రథంపై ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలన అంతా అవినీతి మయమని, అక్రమాలే అన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకు తిని ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ప్రజలు చంద్రబాబుకు ఓటేస్తే కరువుకు ఓటేసినట్లేనని చెప్పారు. వైఎస్సార్ స్వర్ణయుగం రావాలన్నా.. సంక్షేమ అభివృద్ధి పథకాలు పేదలకు అందాలన్నా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో దళారీ, అవినీతి వ్యవస్థను రూపు మాపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండ వైఎస్సార్ సీపీ జెండా..అని, చంద్రబాబునాయుడు మోసగాడు కావటం వలనే దత్త, ఉత్త పుత్రుడులను నమ్మలేక పోతున్నారన్నారు. అందుకే మోదీతో జత కట్టి మోదీ జపం చేస్తున్నారని చెప్పారు. ఎన్ని జెండాలతో ఎంత మంది గుంపులు గుంపులుగా వచ్చినా రాష్ట్రంలో వైఎస్ జగనన్నకు ఎదుర్కొనే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని అన్నారు. ప్రతి కార్యకర్తకు బూచేపల్లి కుటుంబం అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. బూచేపల్లి కుటుంబంపై నమ్మకంతో జగనన్న మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించినందున మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బూచేపల్లి కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జిలు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, నరసింహారెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ షేక్ ఆదాం షరీఫ్ (బుజ్జి), ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీపీలు కోట రామిరెడ్డి, పోశం మధుసూదన రెడ్డి, గోళ్లపాటి మోషే, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎల్‌జీ వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు యాడిక యలమందా రెడ్డి, తూర్పుగంగవరం, రామభద్రాపురం సర్పంచిలు నాగమణి, బాపిరెడ్డి వెంకట లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యులు షేక్ హబిమున్నిషాబేగం, పుట్టా అంకమ్మ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుజ్జుల యోగిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (చందన), తిరుపతిరెడ్డి, పూనూరి దేవదానం, ఇమ్మానియేల్, నాగిరెడ్డి, జక్కుల రామకృష్ణ పాల్గొన్నారు.

21న ప్రపంచ కవితా దినోత్సవం

ఒంగోలు మెట్రో: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) ఆధ్వర్యంలో ఈనెల 21న శనివారం సాయంత్రం 4.30 గంటలకు స్థానిక మల్లయ్య లింగం భవనంలో ప్రపంచ కవితా దినోత్సవంంం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్, నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు, భాషా విభూషణ డాక్టర్ ,నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ సాహితీవేత్త , సంగీత విద్వాంసులు, కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ విశిష్ట అతిథులుగా కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లిఖార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. అనంతరం జరిగే సభలో ప్రముఖులైన పద్యభారతి చదలవాడ లక్ష్మీనరసింహారావు, అధ్యక్షులు, జాతీయ పద్యసారస్వత పరిషత్ , ప్రముఖ భావకవి కోరిశెపాటి బాలకృష్ణారెడ్డి, విశ్రాంత న్యాయమూర్తిని, డాక్టర్ డి.ధాత్రి కుమారి, తెలుగు భాషా పరిశోధకురాలును కళామిత్ర ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తామని తెలిపారు. అనంతరం కవిసమ్మేళనం జరుగుతుందని తెలియజేశారు. యు.వి.రత్నం, డా.మున్నంగి రాజకుమారి, ఓరుగంటి ప్రసాద్, పి.వి.సురేష్, బీరం అరుణ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

జిల్లా చెక్ పోస్టు ప్రారంభం

చినగంజాం: రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని చినగంజాం జాతీయ రహదారిపై చెక్ పోస్టును మంగళవారం పోలీసులు ప్రారంభించారు. ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. శ్రీనివాసరావులు జాతీయ రహదారిపై ఉన్న టోల్ గేట్ వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారిపై వాహనాలను పరిశీలించి పంపనున్నట్లు తెలిపారు. డబ్బు, మద్యంతో పాటు ఏ ఇతర వస్తువులైన ఎటువంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తరలిస్తే వెంటనే సదరు వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పనిచేస్తాం


ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న యాదవ సంఘ నాయకులు

రాచర్ల: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని రాచర్ల పంచాయతీలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన 30 కుటుంబాలు వారు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ అధ్వర్యంలో మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. మరికొంత మంది టీడీపీ సానుభూతిపరులు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భారీ మెజారీటితో గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సూర పాండురంగారెడ్డి, యాదవ సామాజికవర్గ నాయకులు వెల్పుల శాయన్న, వెల్పుల పెద్ద రాజయ్య, కె.బాషా, గడ్డం అవులయ్య, వెల్పుల నారాయణ, గడ్డం బాలారాజు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన సెల్‌ఫోన్ దుకాణదారులు

దర్శి: మండలంలోని సెల్‌ఫోన్ దుకాణాదారులు దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా వచ్చి తనను కలిసి చెప్పుకోవచ్చని తెలిపారు. ఎన్నికల్లో తనకు అందరూ మద్దతు తెలపాలని కోరారు.


శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న సెల్‌ఫోన్ దుకాణదారులు